## తొమ్మిదవ పాఠం

## الدرس التاسع

### ముహమ్మదుర్ రసూలుల్లాహ్ యొక్క భావం

### معنى محمد رسول الله ﷺ

బాహ్యాంతరాల ద్వారా ఆయన అల్లాహ్ దాసుడు మరియు సర్వ మానవాళికి అల్లాహ్ ప్రవక్త అని విశ్వసించాలి. దాని ప్రకారం ఆచరించాలి, అంటే: ①ఆయన ఆదేశాల పట్ల విధేయత చూపాలి, ②ఆయన తెలిపిన విషయాలన్నీ సత్యం అని నమ్మాలి, ③నిషేధించిన, ఖండించిన వాటికి దూరంగా ఉండాలి, ④ఆయన చూపిన విధంగానే అల్లాహ్‌ను ఆరాధించాలి.

**'ముహమ్మదర్ రసూలుల్లాహ్' సాక్ష్యంలో రెండు (రుకున్లు) 'మౌలికవిషయాలు' ఉన్నాయి: అవి; 'అబ్ద్' మరియు 'రసూల్':**

**'అబ్ద్'** అంటే దాసుడు, అల్లాహ్ ను ఆరాధించేవాడు. అంటే: ఆయన మానవుడు. మిగిత మానవుల మాదిరిగానే పుట్టించబడ్డారు. ఇతర మానవులకు ఉన్నటువంటి అవసరాలే ఆయనకు ఉండేవి.

﴿ قُلْ إِنَّمَا أَنَا بَشَرٌ مِثْلُكُمْ ﴾ [الكهف:١١٠]

**{ప్రవక్తా ఇలా చెప్పు: నేను కేవలం ఒక మానవుణ్ణి. మీలాంటి వాణ్ణి}. (సూర కహఫ్ 18:110)**

ఇదే సూరా మొదటి ఆయతులో ఇలా ఉంది:

﴿ الحَمْدُ للهِ الَّذِي أَنْزَلَ عَلَى عَبْدِهِ الكِتَابَ وَلَمْ يَجْعَلْ لَهُ عِوَجًا ﴾ [الكهف:١]

**{అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు, ఆయన తన దాసునిపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. }.**

**'రసూల్'** అనగా; సర్వ మానవాళి వైపునకు శుభవార్తనిచ్చు, హెచ్చరించు ప్రవక్త అని అర్థం. (దీనికి సంబంధించిన ఆధారాలు ఖుర్ఆనులో చాలా ఉన్నాయి. చూడండి సూర సబా (34:28), సూర అంబియా (21:107).

ఈ రెండు ఉత్తమ గుణాలు (రుకున్లు. అంటే: 'అబ్ద్' మరియు 'రసూల్') ఆయన పట్ల అతిశయోక్తి (హెచ్చు) మరియు అమర్యాద (తగ్గు)ల నుండి కాపాడతాయి.

ఎలా అనగా ఆయన అనుచరులు అని చెప్పుకునే కొందరు ఈ రోజుల్లో ఆయన స్థానాన్ని, హక్కును అర్థం చేసుకోక అతిశయించి ఆయన్ని అల్లాహ్‌తో సమానంగా పోలుస్తున్నారు. అల్లాహ్ ను వదలి ఆయనతో మొరపెట్టుకుంటున్నారు. అవసరాలు తీర్చడం, కష్టాలు తొలగించడం లాంటి అల్లాహ్ శక్తిలో మాత్రమే ఉన్న వాటిని ఆయనతో కోరుతున్నారు.

మరి కొందరు ఆయన గౌరవ మర్యాదలకు విరుద్ధంగా ఆయన్ను ప్రవక్తగా నమ్మడం లేదు. లేదా ఆయన అనుకరణలో కొరత చూపుతున్నారు. ఆయన పట్ల వారిపై విధిగా ఉన్న హక్కు నెరవేర్చడం లేదు. ఇతరుల మాటలను, ఫత్వాలను ఆయన సున్నతలపై ప్రాధాన్యతనిస్తున్నారు, ఆయన సున్నతులను ఆచరించకుండా వదులుతున్నారు.

అందుకే ఏ ముస్లిం కూడా ప్రవక్తను ఆయన స్థానానికి మించి లేపకూడదు. ఆయన స్థానానికి తక్కువ చేసి అమర్యాద పరచకూడదు. ఆయన **'అబ్ద్'** మరియు **'రసూల్'.**